క్లుప్తంగా

స్వాతంత్య్ర వేడుకలకు సర్వం సిద్ధం

మద్నూర్(జుక్కల్): స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. వేడుకలను ఘనంగా నిర్వహించటానికి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాల్లో మంగళవారం మువ్వన్నెల జెండా ఎగురవేయడానికి ఏర్పాట్లు చురుగ్గా సాగాయి. పాఠశాలలో విద్యార్థులు తమ తమ తరగతి గదులను చూడముచ్చటగా అలంకరించుకున్నారు. తహసీల్, ఎంపీడీవో, ఎంఈవో, గ్రామ పంచాయతీ, పంచాయతీ రాజ్, ఆర్అండ్బీ కార్యాలయాలతో పాటు పలు చోట్ల నేడు మువ్వన్నెల జెండాలు రెపరెపలాడనున్నాయి.

డోంగ్లీవాసికి డాక్టరేట్



మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని లింబుర్‌కు చెందిన సీహెచ్ శంకర్‌కు జంతు శాస్త్రంలో ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 12న డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. ఎఫెక్ట్ ఆఫ్ ఆర్గానిక్ మనియూర్స్ అండ్ ప్లాంట్ ఆన్ పెస్ట్స్ ఆఫ్ చిక్ పి అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ లభించిందని ఆయన సోమవారం తెలిపారు. ఈ పరిశోధన అంశాలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయని ఆయన అన్నారు. ప్రస్తుతం శంకర్ బోధన్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జంతుశాస్త్రం అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

రాజంపేట తహసీల్దార్‌గా అనిల్ కుమార్



రాజంపేట: మండల తహసీల్దార్‌గా సోమవారం బి.అనిల్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ రూరల్ మండలం తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన అనిల్‌కుమార్ బదిలీపై రాజంపేట తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఇదివరకు ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన టి.శాంత రెండు రోజుల క్రితం ప్రమోషన్‌పై నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు.

'అవగాహన కల్పించాలి'



రామారెడ్డి(ఎల్లారెడ్డి): రామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో అందుతున్న వైద్య సాయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని రామారెడ్డి ప్రభుత్వ వైద్యాధికారి సురేష్ అన్నారు. సోమవారం మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో భాగంగా పోసానిపేట్ సబ్ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. టి–హబ్ ద్వారా 18 రకాల టెస్టులు చేసే అవకాశాన్ని ప్రజలు ఉచితంగా వినియోగించుకోవచ్చని సూచించారు. వైద్య సిబ్బంది భీమ్, భువనేశ్వరి, శోభ పాల్గొన్నారు.

కొనసాగుతున్న అడ్మిషన్లు



బీబీపేట: మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందని ప్రిన్సిపల్ జైపాల్ రెడ్డి అన్నారు. ఇప్పటివరకు 45 వరకు అడ్మిషన్లు వచ్చాయని విద్యార్థులు త్వరగా అడ్మిషన్లు తీసుకోవాలని సూచించారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు ఉన్నాయని తెలిపారు. తరగతులు సైతం ప్రారంభమయ్యాయని తెలిపారు. లెక్చరర్లు సంతోష్, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సేవలు ప్రశంసనీయం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): రెడ్ క్రాస్ సొసైటీ సేవలు ప్రశంసనీయమని తహసీల్దార్ దశరథ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిరు పేదలకు వంట సామగ్రి, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దశరథ్ మాట్లాడుతూ.. ఇళ్లు కూలిపోయిన బాధిత కుటుంబాలను ఆదుకోవడం ప్రశంసనీయమని అన్నారు. డివిజన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు రియాజొద్దీన్, సాయి రెడ్డి, మండల అధ్యక్షులు నందు, ఆర్ఐ అంజయ్య, పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు

నిజాంసాగర్(జుక్కల్): నా మట్టి– నా దేశం కార్యక్రమంలో బాగంగా సోమవారం మండల కేంద్రంలోని మంకీఫుడ్ కోర్టు ఆవరణలో మండల అధికారులు, నాయకులు 75 మొక్కలు నాటారు. స్వాతంత్య్ర వచ్చి 75 సంత్సరాలు కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు మొక్కలు నాటారు. నాయకులు సందీప్, లింగాగౌడ్, ఎంపీడీవో నాగేశ్వర్, ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శి గంగారాం ఉన్నారు.

రైతన్న గుండె కోత

- భారీ వర్షాలకు తెగిన చెక్ డ్యాం
- ఒకటిన్నర ఎకరం పొలానికి తీవ్ర నష్టం





తెగిన చెక్ డ్యాం

మాచారెడ్డి: ఇటీవల వరుసగా కురిసిన భారీ వర్షాలకు చెక్ డ్యాం తెగిపోయి బోరు మోటార్‌తో పాటు ఒకటిన్నర ఎకరం పొలం కొట్టుకుపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలోని చుక్కాపూర్, బండరామేశ్వరపల్లి గ్రామాల మధ్య పారుతున్న పాల్వంచ వాగుకు అడ్డంగా చెక్ డ్యాం నిర్మించారు. ఇటీవల వరుసగా కురిసిన భారీ వర్షాలకు చెక్ డ్యాం తెగిపోయింది. దీంతో వాగు అంచులో ఉన్న చుక్కాపూర్ గ్రామానికి చెందిన మినుకూరి మహిపాల్ రెడ్డికి ఉన్న నాలుగు ఎకరాల పొలం నుంచి ఎకరం పొలంతో పాటు బోరు మోటార్ కొట్టుకుపోయి దాదాపు రూ.35 లక్షల నష్టం వాటిల్లిందని ఆయన బావురుమన్నాడు. అలాగే అదే గ్రామానికి చెందిన మినుకూరి కిషన్‌కు ఉన్న మూడెకరాల నుంచి అర ఎకరం పొలం కొట్టుకుపోయింది. దీంతో రూ.15 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం కోసం అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా స్పందించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు నష్ట పరిహారం ఇప్పించాలని కోరారు.

పరిహారం అందించాలి



చెక్ డ్యాం తెగిపోయి నాకున్న మూడెకరాల భూమి నుంచి అర ఎకరం కొట్టుకుపోయింది. ఇంత వరకు మాకు నయా పైసా నష్ట పరిహారం అందలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమను ఆదుకోవాలి. – కిషన్, చుక్కాపూర్

పట్టించుకునే నాథుడే లేడు



చెక్ డ్యాం తెగిపోయి తాము తీవ్రంగా నష్టపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా లాభం లేకుండా పోతోంది. అధికారులు స్పందించి తమకు నష్ట పరిహారం అందించాలి. – మహిపాల్ రెడ్డి, చుక్కాపూర్

రోడ్డు బాగు చేయాలని గ్రామస్తుల ఆందోళన



రాస్తారోకో చేస్తున్న ఎండ్రియాల్ గ్రామస్తులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎండ్రియాల్ శివారులో కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రోడ్డులో సోమవారం ఎండ్రియాల్ గ్రామస్తులు రాస్తారోకో చేశారు. కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రోడ్డు నుంచి ఎండ్రియాల్ వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా తయారైందన్నారు. దీంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈవిషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోడ్డుకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి పనులు ప్రారంభించేలా చూడాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రాస్తారోకో విరమింపజేశారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు



నిజాంసాగర్(జుక్కల్): అచ్చంపేట గ్రామం నుంచి నాందేడ్- సంగారెడ్డి జాతీయ రహదారి వరకు ఉన్న మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు ప్రభుత్వం రూ.4 కోట్లు మంజూరు చేసిందని పిట్లం సబ్‌డివిజన్ పంచాయతీరాజ్ డీఈఈ విజయ్ కుమార్ తెలిపారు. సోమవారం అచ్చంపేట గ్రామ శివారులో మట్టి రోడ్డును పరిశీలించి కొలతలు తీసుకున్నారు. త్వరలోనే టెండర్ ప్రక్రియను పూర్తి చేయించి బీటీ రోడ్డు వేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పంచాయతీరాజ్ ఏఈ సురేశ్, తదితరులున్నారు.

మీకు సేవ చేసేందుకే నేనున్నాను



మద్నూర్‌లో ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న నేతలు



పిట్లంలో గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

- ఎమ్మెల్యే హన్మంత్ సింధే
- ఘనంగా సింధే జన్మదిన వేడుకలు

పిట్లం/బిచ్కుంద/నిజాంసాగర్/మద్నూర్ : జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే జన్మదిన వేడుకలను బిచ్కుంద, మద్నూర్, నిజాంసాగర్, పిట్లం, జుక్కల్ మండలాల్లో బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించి ఆయనకు తినిపించి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేరు మీద ఆలయాల్లో పూజలు చేయించి భారీగా బైక్ ర్యాలీ తీశారు. పిట్లంలో గజమాలతో ఎమ్మెల్యేను సన్మానించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆయన అభిమానులు పండ్లు పంపిణీ చేశారు. జుక్కల్ నియోజకవర్గ ప్రజల సేవ కోసమే ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలిపెట్టినట్లు మద్నూర్‌లో ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పేర్కొన్నారు. మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధేకు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, సత్యనారాయణ, మనోహర్, రమేష్‌గౌడ్, నర్సింహారెడ్డి, కమ్మరికత్త అంజయ్య, లక్ష్మీనారాయణ, లింగాల రాంచందర్, సందీప్, లింగాగౌడ్, అబ్జల్, తదితరులు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.



నిజాంసాగర్‌లో..



శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రులు కేటీఆర్, హరీశ్

తపస్ ధర్నాను విజయవంతం చేయాలి



కామారెడ్డి టౌన్/బాన్సువాడ: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపడుతున్న మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్షుడు పుల్గం రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి భూనేకర్ సంతోష్‌లు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ధర్నా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ మహాధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. ఈ మహాధర్నాకు జిల్లాలోని ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. తపస్ రాష్ట్ర బాధ్యులు భాస్కర చారి, జిల్లా బాధ్యులు లక్ష్మీపతి, ఆంజనేయులు, రాజశేఖర్, దత్తాచారి, తదితరులు పాల్గొన్నారు.

17న అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో 17వ తేదీన జిల్లా స్థాయి మిడిల్, లాంగ్ డిస్టెన్స్ 600, 800, 1500, 5వేలు, పదివేల మీటర్ల విభాగాలలో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, 16, 18, 20 విభాగాలలో నిర్వహించే పోటీలలో బాలబాలికలు పాల్గొనాలని సూచించారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు

దోమకొండ: మండల కేంద్రంలోని శివరాంమందిర్‌తో పాటు మార్కండేయ మందిరంలో సోమవారం మాసశివరాత్రి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఐరేని నర్సయ్య, మ్యాక నాగరాజు, బొమ్మెర గంగాధర్, గణేష్, పులబోయిన రాజు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కాగడాల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న బజరంగ్‌దళ్ నాయకులు

ఎల్లారెడ్డి: పట్టణంలో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కాగడాల ర్యాలీ నిర్వహించారు. అఖండ్ భారత్ సంకల్ప్ దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి గాంధీచౌక్ వరకు కాగడాల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తులసి, సాయి, విద్యాసాగర్, సాయిబాబా, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో .. బీజేపీ నేతలు

బీజేపీ నేతల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బీజేపీ నేతలు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రజలకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం గురించి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నేతలు నర్సింలు, గణేశ్‌రెడ్డి, ఏక్‌నాథ్, బాల్‌లింగం, నరేందర్‌రెడ్డి, రమేశ్, సిద్ధరాములు పాల్గొన్నారు.

సంక్షిప్తం

బాలికలకు కిట్ల పంపిణీ

నిజాంసాగర్(జుక్కల్): గాలిపూర్ ఉన్నత పాఠశాలల విద్యార్థినులకు సోమవారం గ్రామ సర్పంచ్ లక్ష్మారెడ్డి, హెచ్ఎం అమర్‌సింగ్ చేతుల మీదుగా శానిటరీ కిట్లను పంపిణీ చేశారు. కిట్లను ప్రభుత్వం ఉచితంగా అందజేసినట్లు సర్పంచ్ తెలిపారు.

జాతీయ జెండాలు..

బాన్సువాడ: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో పట్టణంలో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ప్రతీ దుకాణ యజమానికి జెండాలను అందజేశారు. స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ప్రతి ఒక్కరి ఇంటిపై జెండాను ఎగరవేయాలని నియోజకవర్గ కన్వీనర్ కొత్తకొండ భాస్కర్ కోరారు. నేతలు అశ్విన్, విశాల్, వాల్మీకి, గుడుగుట్ల శ్రీనివాస్, శంకర్‌గౌడ్ ఉన్నారు.

వంట కార్మికులకు చీరలు..

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులతో పాటు మహిళా వంట కార్మికులకు సోమవారం సెక్టోరియల్ అధికారి అమర్‌సింగ్ చేతుల మీదుగా చీరలను అందజేశారు. కార్మికులను ప్రోత్సహించడంతో పాటు వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆయన అన్నారు.

విధుల్లో చేరిన సిబ్బంది

దోమకొండ: స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం ఏడుగురు సిబ్బంది కొత్తగా విధుల్లో చేరినట్లు తహసీల్దార్ సంజీవ్‌రావ్ తెలిపారు. వారిలో ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు రికార్డు అసిస్టెంట్లు, ఒక వాచమెన్ ఉన్నారని వెల్లడించారు. అనంతరం సన్మానించారు.

బీఆర్ఎస్‌లోకి వార్డు సభ్యుడు

నిజాంసాగర్(జుక్కల్): అచ్చంపేట జీపీ వార్డు సభ్యుడు చాకలి బాలయ్య సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ నాయకులు దుర్గారెడ్డి, సత్యనారాయణ, గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

సుద్ద ముక్కలతో 12 భాషల్లో జాతీయ గీతం





మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి పత్తివార్ మధుకర్ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సోమవారం సుద్ద ముక్కలతో తెలుగు, హిందీ, ఇంగ్లీష్, కన్నడ, మలయాళం, తమిళం, ఉర్దూ, పంజాబీ, గుజరాతీ, ఒరియా, అస్సామి, బెంగాలీ ఇలా మొత్తం 12 భాషల్లో చెక్కి తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సుద్ద ముక్కలను అక్షరాలుగా చెక్కి 12 భాషల్లో తయారు చేశానని తెలిపారు. సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉండాలని ఇలా చేశానని చెప్పారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ దశమ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సూక్ష్మ చిత్ర కళాకారుడుగా పత్తివార్ మధుకర్‌కు హైదరాబాద్‌లో ఆదివారం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది.

న్యాయబద్ధమైన డిమాండ్లను నెరవేర్చాలి



నస్రుల్లాబాద్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు



పిట్లంలో తహసీల్దార్‌కు..

బాన్సువాడ: తమ న్యాయ బద్ధమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సోమవారం సెకండ్ ఏఎన్ఎంలు నస్రుల్లాబాద్ తహసీల్దార్ రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 16 నుంచి నిరవధికంగా సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఏఎన్ఎంలు శిరీష, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిట్లం(జుక్కల్): పిట్లం తహసీల్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ రాంమోహన్‌రావ్‌కు ఏఎన్ఎంలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పుడు తమకు పరీక్షలు పెట్టడం సముచితం కాదని అన్నారు. ప్రభుత్వం తమపై దయతలచి నోటిఫికేషన్‌ను రద్దు చేసి బేషరతుగా తమను రెగ్యులర్ చేయాలని కోరారు.

'చిన్న పట్టణాల్లో కార్పొరేట్ దుకాణాలు వద్దు'

- పట్టణ స్వర్ణకార సంఘం నాయకుల నిరసన



వినతి పత్రం అందజేస్తున్న స్వర్ణకార నాయకులు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణంలో కార్పొరేట్ బంగారు ఆభరణాల దుకాణాలు ఏర్పాటు చేయడం ద్వారా స్వర్ణకార వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న పదిహేను వందల కుటుంబాలు వీధిన పడే అవకాశం ఉందని పట్టణ స్వర్ణకార సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి సత్యగార్డెన్‌లో ఒక కార్పొరేట్ సంస్థ ఏర్పాటు చేసిన ఆభరణాల ప్రదర్శన వద్ద సోమవారం పట్టణ స్వర్ణకారులు నిరసన తెలిపి తమ వినతి పత్రాన్ని కంపెనీ ప్రతినిధికి అందజేశారు. కార్పొరేట్ ఆభరణాల దుకాణాల ఏర్పాటును వ్యతిరేకిస్తూ త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు నాయకులు ప్రకటించారు. నాయకులు చక్రం, గవ్వలపల్లి శ్రీనివాస్, ధర్మాజీ బ్రహ్మాచారి, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డికి చేరిన రాజీవ్ జ్యోతి సద్భావన యాత్ర



స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

కామారెడ్డి టౌన్: దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఉగ్రవాదానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజీవ్ జ్యోతి సద్భావన యాత్ర సోమవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు యాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. తమిళనాడులోని శ్రీపెరంబదూర్ నుంచి ఈ యాత్రను ప్రారంభించామని రాజీవ్‌గాంధీ సమాధి వద్ద జ్యోతిని సమర్పించనున్నట్లు యాత్ర నిర్వాహకుడు కర్ణాటక పీసీసీ ఉపాధ్యక్షుడు ఆర్.దొరై తెలిపారు. కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొనే శ్రీనివాస్, తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



బీబీపేట: మండల కేంద్రానికి చెందిన పెద్ద ఉప్పు, తేలు వారి మున్నూరు కాపు సంఘం సభ్యులు సోమవారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలాధ్యక్షుడు సుతారి రమేష్ అధ్వర్యంలో గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో చేరామన్నారు. భూమాగౌడ్, ఎల్లం, శేఖర్, నారాయణ, లింగం, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఫ్లెక్సీలో బీజేపీ కార్యకర్తల ఫోటో

బిచ్కుంద(జుక్కల్): ఎమ్మెల్యే హన్మంత్ సింధే జన్మదిన శుభాకాంక్షలు తెలిపే ఫ్లెక్సీపై బీఆర్ఎస్ కార్యకర్తల ఫొటోతో పాటు బీజేపీ కార్యకర్త ఫొటో కూడా పెట్టడంతో రగడ మొదలయ్యింది. బీజేపీ ఓబీసీ మండల అధ్యక్షుడు గోపాల్ చారి తన ఫొటో బీఆర్ఎస్ ఫ్లెక్సీలో ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే దురుద్దేశంతో బీఆర్ఎస్ నాయకులు వారి ఫ్లెక్సీలో నా ఫోటో పెట్టారని అన్నారు. దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



బాన్సువాడలో సమావేశమైన దివ్యాంగులు

బాన్సువాడ: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని వికలాంగుల హక్కుల సమితి జిల్లా అధ్యక్షుడు గంగాధర్ చారి అన్నారు. సోమవారం బాన్సువాడలో వికలాంగులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేయాలని, ప్రతి నెలా దివ్యాంగులకు రూ.10 వేల పింఛన్ ఇవ్వాలన్నారు. అలాగే ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల సమితి సభ్యులు సాయిలు, బస్వరాజ్‌పాటిల్, ప్రకాష్‌రావు, లక్ష్మణ్, కృష్ణ ఉన్నారు.

మాచారెడ్డి గౌడ సంఘం కార్యవర్గం



అధ్యక్షుడిని సన్మానిస్తున్న గౌడ నాయకులు



నియామక పత్రం అందజేస్తున్న నేతలు

మాచారెడ్డి: మండల గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉగ్రవాయి నర్సాగౌడ్, ఉపాధ్యక్షులుగా సుదర్శన్ గౌడ్, స్వామి గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పతిగౌడ్, తదితరులను ఎన్నుకున్నారు.

రజక యువజన సంఘం..

రాజంపేట: మండల కేంద్రంలో సోమవారం రజక యువజన సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాగ్గారి నరేష్, ఉపాధ్యక్షుడిగా జంగంపల్లి నిఖిల్, కార్యదర్శిగా స్వామి, సలహాదారులుగా దాగ్గారి స్వామిలు ఎన్నికయ్యారు.

బీసీ సంక్షేమ సంఘం నియామకం

కామారెడ్డి అర్బన్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా దొంతుల లింబాద్రిని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్టు సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు తెలిపారు. సంఘం జిల్లా నాయకులు మోహనచారి, హాజీ అబ్దుల్ అజీజ్, సీహెచ్ రాజయ్య, నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.